సాక్షి
విజయనగరం
బుధవారం । 21 । ఫిబ్రవరి । 2024



ఆరోగ్యశ్రీతో.. వినికిడి సమస్యకు విముక్తి

ఓ చిన్నారి చెవుడు, మూగ సమస్యకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో విముక్తి కలిగింది.

- 8లో



సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు.

- 8లో



భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం

హజరత్ ఖాదర్‌వలీబాబా ఉరుసు మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది.

- 8లో

న్యూస్‌రీల్

నేడు పూసపాటిరేగలో జాబ్‌మేళా

పూసపాటిరేగ: స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తామని వెలుగు ఏపీఎం పెంటంనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొడక్ట్ కెమిస్ట్రీ ఉద్యోగానికి బీఎస్సీ, సేల్స్‌సూపర్‌వైజర్ ఉద్యోగాలకు ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, సైట్ సూపర్ వైజర్‌కు ఏదైనా డిగ్రీ చదివిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వయస్సు 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. హైదరాబాద్, విశాఖపట్టణంలో ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీ

విజయనగరం అర్బన్: గ్రామ జలసంఘాల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ విధానంలో చేపట్టే జల్‌జీవన్ మిషన్ పనులు పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే కమిటీలో గ్రామీణ నీటిసరఫరా విభాగం ఎస్‌ఈ, జెడ్పీ సీఈఓ, డీపీఓ, డీఆర్‌డీఏ పీడీ, డీడబ్ల్యూఎంఏ పీడీ, సమగ్రశిక్ష ఈఈ, గ్రామీణ నీటి సరఫరా, సహజవనరుల నిర్వహణ, సమాజాభివృద్ధి రంగంలో నిపుణులైన ఒకరు సభ్యులుగా ఉంటారని గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎస్‌ఈ ఉమాశంకర్ తెలిపారు. అలాగే, పనుల నిర్వహణలో వచ్చే సాంకేతిక, పరిపాలన పరమైన సమస్యల పరిష్కారం, పనులు చేపట్టేందుకు అవసరమైన సామగ్రి సమకూర్చడంలో సహాయపడేందుకు జేసీ ఆధ్వర్యంలో హైపర్ కమిటీని ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు.

పార్టీని బలోపేతం చేయండి

విజయనగరం టౌన్: జనసేన పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు పిలుపునిచ్చారు. స్థానిక వీఆర్ గ్రాండ్‌లో పార్టీ నాయకులతో మంగళవారం అంతర్గత సమావేశం నిర్వహించారు. ఎన్నికలపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తరాంధ్ర రాజకీయ వ్యవహారాల ముఖ్య ప్రతినిధి సుందరపు సతీష్, పడాల అరుణ, రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పాలవలస యశస్విని, జనసేన సమన్వయకర్త లోకం మాధవి, గురానఅయ్యలు, తదితరులు పాల్గొన్నారు.

6,7 తేదీల్లో టెక్నికల్ సింపోజియం

- పోస్టర్‌ను ఆవిష్కరించిన వీసీ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య



పోస్టర్ విడుదల చేసిన వీసీ ప్రొఫెసర్ వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) ఇంజినీరింగ్ కళాశాలలో వచ్చేనెల 6, 7వ తేదీల్లో 'టెక్నికల్ సింపోజియం ఈఐఎస్‌ఈఎన్–2024' కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మెటలర్జికల్ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.మణికుమార్ తెలిపారు. కళాశాలలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.వెంకట సుబ్బయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ టెక్నికల్ సింపోజియం పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. 3 డీ ప్రింటింగ్ టెక్నాలజీపై వర్క్‌షాప్ జరుగుతుందని, ఆసక్తిగల విద్యార్థులు పాల్గొని సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందుచుకోవాలని ఆయన కోరారు.

ఆనందమానందమాయె

- లబ్ధిదారులకు టిడ్కో ఇళ్లు అప్పగింత
- ఒక్క రూపాయికే సొంతమైన ఇల్లు
- ఆనందంలో లబ్ధిదారులు
- టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి బొత్స, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల
- లబ్ధిదారులకు ఇంటి పత్రాలు, తాళాలు అందజేసిన ప్రజాప్రతినిధులు



సోనియానగర్‌లో టిడ్కో ఇంటి లబ్ధిదారుకు నమూనా తాళం అందజేస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, కలెక్టర్ నాగలక్ష్మి, తదితరులు

విజయనగరం గంటస్తంభం: విజయనగరం పట్టణానికి సమీపంలో.. ఖరీదైన స్థలంలో 300 చదరపు అడుగుల విస్తీర్ణంలో... సకల సదుపాయాలతో నిర్మించిన టిడ్కో ఇంటిని ఒక్క రూపాయికే అప్పగించడంతో లబ్ధిదారులు ఉబ్బితబ్బిబ్బయ్యారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషితో సొంతింటి భాగ్యం కలిగిందంటూ సంబరపడ్డారు. ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఇళ్ల పత్రాలు, తాళాలను సంతోషంగా అందుకున్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు క్షీరాభిషేకం చేశారు. సోనియానగర్‌లో మంగళవారం జరిగిన టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవ సంబరంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీస్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, కలెక్టర్ నాగలక్ష్మి, టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అందరినీ ఓ ఇంటివారిని చేయాలన్నదే ధ్యేయం

పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతంటి కల నేరవేర్చి, అందరినీ ఒక ఇంటివారిని చేయాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. టిడ్కో ఇళ్ల నిర్మాణంతో కొందరి సొంతంటి కల నేరవేర్చామన్నారు. సోనియానగర్‌లో 1120 ఇళ్ల నిర్మాణం చేపట్టగా, 448 ఇళ్లను లబ్దిదారులకు అప్పగించామన్నారు. 300 చదరపు అడుగులు విస్తీర్ణం గల 191 ఇళ్లను ఒక్కో రూపాయికి, 430 చదరపు అడుగులు గల 256 ఇళ్లను రూ.3.80 లక్షలకు అప్పగిస్తున్నామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ ఇళ్లకు రూ.8.50లక్షలు వసూలు చేయాలని నిర్ణయించందన్నారు. టిడ్కో ఇళ్లు పొందిన లబ్ధిదారులు గృహప్రవేశాలు చేసి పిల్లపాపలతో సుఖంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఓటేసిన వారి కర్తవ్యాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వం నెరవేర్చిందన్నారు. ఎమ్మెల్యేగా వీరభద్రస్వామిని గెలిపించాలని కోరారు. ప్రభుత్వం మళ్లీ కొలువుదీరేలా ఆశీర్వదించాలన్నారు.

పేదల కల సాకారం: డిప్యూటీ స్పీకర్

టిడ్కో ఇళ్ల కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న పేదలు కలను సాకారం చేశామని డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను గోడలు కట్టి తడపకుండా వదిలేసిందని ఆరోపించారు. ఇప్పుడు తిరిగి తాము కట్టిన ఇళ్లు ఎందుకు ఇవ్వడం లేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారని, వారు కడితే ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 2019 ఎన్నికలు ముందు హడావుడి చేసి ఏ పని చేయకుండా వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం అన్ని సౌకర్యాలతో ఇళ్లనిర్మాణాన్ని పూర్తిచేసి, పాత లబ్ధిదారులకే ఇస్తున్నామని గుర్తు చేశారు. లబ్ధిదారులు ఏ ఒక్కరికీ ఒక్క రూపాయి కూడా లంచం ఇవ్వకుండా ఇంటి తాళాలు తీసుకోవాలని సూచించారు. మిగిలిన ఇళ్లు వారం రోజుల్లో పూర్తిచేసి అందజేస్తామన్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ సహకారంతో పట్టణాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశామన్నారు. గత పాలనకు, ప్రస్తుత పరిపాలనకు తేడాను ప్రజలు గమనించాలని కోరారు. ఏమైనా అవసరాలు ఉంటే ఎప్పుడైనా వచ్చి తెలియజేసుకోవచ్చన్నారు.

అన్ని సౌకర్యాలతో ఇళ్లు అందజేత

అన్ని సౌకర్యాలతో ఇంటి నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేశామని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. జీ ప్లస్ త్రి పద్ధతిలో ఇళ్ల నిర్మాణం చేపట్టామని, సారిపల్లిలో 2600, సోనియా నగర్‌లో 1120 ఇళ్లు విజయనగరంలోని పట్టణ పేదలకు అందజేశామన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సాయంతో ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. మహిళల పేరుతో ప్రభుత్వం ఇళ్ల పత్రాలు అందజేసి ఆస్తిపరులను చేయడం గర్వకారణమన్నారు.



టిడ్కో ఇళ్ల ప్రారంభోత్సవానికి హాజరైన లబ్ధిదారులు

అట్టహాసంగా ప్రవేశాలు



టిడ్కో ఇంటిలో గృహ ప్రవేశం చేస్తున్న పైడితల్లి కుటుంబ సభ్యులు

టిడ్కో గృహప్రవేశాలు సోనియా నగర్‌లో అట్టహాసంగా జరిగాయి. మంత్రి, డిప్యూటీ స్పీకర్, కలెక్టర్, టిడ్కో రాష్ట్ర చైర్మన్‌లు ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏ 5 బ్లాకులో ఉన్న 8 ఇళ్లలో గృహ ప్రవేశం చేశారు. కార్యక్రమం చివరలో పి. పైడితల్లి, కాగితపు లక్ష్మి, షావుకారి కళావతి, బుద్దరాజు రాధలకు ఇంటి పత్రాలు, తాళాలు అందజేశారు. కార్యక్రమంలో విజయనగరం కార్పొరేషన్ మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, టిడ్కో ఈఈ ఎ.జ్యోతి, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

సొంతంటి కల నెరవేరింది



ఇన్నాళ్లకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషితో సొంతింటి కల సాకారమైంది. స్థానిక నాయకులకు, జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం.

– సోమాదుల మంగమ్మ, కంటోన్మెంట్

ఆనందంగా ఉంది



టిడ్కో ఇంటి కోసం ఐదేళ్ల కిందట డబ్బులు కట్టించుకున్నారు. ఇల్లు మంజూరైందని చెప్పారు. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక ఇళ్ల నిర్మాణం పూర్తిచేసింది. రెండు రోజుల కిందట సోనియా నగర్‌లో ఇల్లు ఇస్తాం.. రావాలని చెప్పారు. ఒక్క రూపాయికే ఇంటిని అప్పగించారు. సొంతంటి కల నెరవేరింది. సంతోషంగా ఉంది.

– కోరాద సింహాచలం, తోటపాలెం

ఇల్లు బాగుంది



2018లో రూ.500 కట్టించికుని ఇల్లు ఇస్తామన్నారు. ఇంతవరకు ఆ ఊసే లేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇల్లు పూర్తి చేసి అందించింది. రూపాయి కూడా అడగలేదు. పైగా ఇల్లు చాలా బాగా ఉంది. అన్ని సౌకర్యాలు కల్పించారు. ఇంతకంటే ఏమి కావాలి. అద్దె ఇంట్లో ఉండి కష్టాలు పడుతున్నాం. తొందరిలోనే మంచి ముహూర్తాన సొంతింటికి వచ్చేస్తాం. సంతోషంగా ఉంటాం.

– పి.ఉష, విజయనగరం

ఉచితంగా ఇచ్చారు



ఇంటికోసం తాము ఎవరికీ డబ్బులు ఇవ్వలేదు. ఉచితంగా అన్ని సౌకర్యాలు ఉన్న అపార్టుమెంట్ లాంటి ఇల్లు ఇచ్చారు. మా కుటుంబానికి చాలు. అద్దె బాధ ఇకపై ఉండదు.

– బోనెల వెంకటి, గాజులరేగ



పేదలకు అప్పగించిన టిడ్కో ఇళ్లు

అయ్యో రామా!

- రామభక్తులకు బీజేపీ నాయకులు టోకరా
- అయోధ్యకు రైలుటికెట్ పేరుతో అక్రమ వసూళ్లు
- రూ.40 లక్షల వరకూ దండుకున్న వైనం!
- బీజేపీ కార్యాలయం వద్ద టికెట్ల కోసం భక్తుల అలజడి
- ఆలస్యంగా స్పందించిన జిల్లా అధ్యక్షుడు ఎన్‌ఈఆర్

సాక్షి ప్రతినిధి, విజయనగరం: అయోధ్య రాముడిని దర్శించుకోవాలన్న రామభక్తుల ఆశను క్యాష్ చేసుకోవడానికి కొంతమంది తెగించారు! వారంతా మరేదో పార్టీ కాదు! సాక్షాత్తూ భారతీయ జనతాపార్టీకి చెందినవారే కావడం గమనార్హం. అయోధ్యలో రామాలయం దర్శనానికి వెళ్లాలనుకున్న భక్తుల కోసం ప్రత్యేక రైళ్లను రైల్వే శాఖ నడుపుతోంది. ఇప్పటికే విజయనగరం నుంచి కూడా రెండు సార్లు భక్తులు వెళ్లివచ్చారు. ఈ నేపథ్యంలో అయోధ్య వెళ్లాలనుకునేవారి సంఖ్య పెరిగింది. వారి ఆసక్తిని క్యాష్ చేసుకోవడానికి కొంతమంది బీజేపీ నాయకులు స్కెచ్ వేశారు. వాస్తవానికి ఒక్కో టికెట్‌కు రూ.1,725 తీసుకోవాల్సి ఉంది. కానీ ఒక్కో భక్తుడి నుంచి రూ.2 వేల చొప్పున వసూలు చేశారు.

రూ.40 లక్షల వరకూ దండేశారు...

వాస్తవానికి ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 70 టికెట్లు ఇవ్వాలనే ఉద్దేశంతో పార్లమెంట్ నియోజకవర్గానికి 350 చొప్పున టికెట్లను బీజేపీ కేంద్ర నాయకత్వం కేటాయించింది. ఈ విషయం తెలుసుకున్న గొలగాన రమేష్ తదితరులు రంగంలోకి దిగారు. ఒక్కో టికెట్‌కు రూ.2 వేల చొప్పున వసూలు చేశారు. విజయనగరం పార్లమెంటరీ నియోజకవర్గానికి వచ్చిన టికెట్లే 350 అయితే ఇక్కడ ఏకంగా 2 వేల మంది నుంచి రూ.40 లక్షల వరకూ వసూలు చేసేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ 2వేల మంది పేర్లతో ఒక జాబితాను తయారుచేసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నడికుదిటి ఈశ్వర రావు (ఎన్‌ఈఆర్)కు అందించారు.

టిక్కెట్ల కోసం ఆందోళన...

డబ్బు చెల్లించిన రామభక్తులు కొందరు విజయనగరంలోని బీజేపీ కార్యాలయానికి వెళ్లి టిక్కెట్ల కోసం ఆరాతీశారు. తాము మోసపోయామని తెలుసుకున్నవారు ఆందోళన చేశారు. ఇదేదో తమ మెడకు చుట్టుకునేలా ఉందని గ్రహించిన బీజేపీ జిల్లా నాయకులు ఆలస్యంగా మేల్కొన్నారు. డబ్బులు వసూలు చేసిన గొలగాన రమేష్‌పై చర్యలు తీసుకోవాలంటూ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొబ్బిలి శ్రీను విజయనగరం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మరోవైపు రమేష్ నుంచి రూ.6 లక్షల రికవరీ చేసినట్లు తెలిసింది. దీనిపై పూర్తిస్థాయిలో పోలీసులు దర్యాప్తు చేయాలని రామభక్తులు కోరుతున్నారు. ఇలాంటి వ్యవహారాల్లో ఎంతో బాధ్యతగా ఉండాల్సిన బీజేపీ జిల్లా నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదింటి ఆడబిడ్డల్లో కళ్యాణ కాంతులు

- వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా కింద ప్రభుత్వం ఆర్థిక సాయం
- జిల్లాలో ఐదు విడతల్లో 3,239 మందికి రూ.18.85 కోట్ల లబ్ధి
- ఐదో విడతలో 370 మందికి రూ.2.35 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి జగన్
- కళ్యాణమస్తుతో బాలికా విద్యకు తోడ్పాటు



లబ్ధిదారులకు వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన

విజయనగరం అర్బన్: వివాహం ప్రతి ఒక్కరి జీవితంలో మధురానుభూతి ఇచ్చే ఘట్టం. పేదకుటుంబాల వారు పిల్లలను చక్కగా చదివించుకుని, గౌరవంగా వివాహం చేసేందుకు వీలుగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా పథకాలను అమలుచేస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులతో పాటు కులాంతర వివాహం చేసుకున్న వారికి ఆర్థిక సహాయాన్ని అందజేస్తోంది. కళ్యాణమస్తు, షాదీతోఫా కింద లబ్ధిదారులకు ఐదో విడత నిధులను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం విడుదల చేశారు. కార్యక్రమాన్ని స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, లబ్ధిదారులు వర్చువల్‌గా తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐదో విడతగా జిల్లాకు చెందిన 370 మంది మహిళలకు రూ.2.35 కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. బీసీ కేటగిరీకి చెందిన 296 మంది, ఎస్సీ మహిళలు 60 మంది, ఎస్టీలు 13, ఓసీ మహిళ ఒకరికి ఆర్థిక ప్రయోజనం కలిగిందని తెలిపారు. కులాంతర వివాహాలకు ఇచ్చే పారితోషికాల కోసం పదోతరగతి చదవాలన్న నిబంధన కారణంగా ఆయా వర్గాల్లో తక్కువ వయస్సులోనే జరిగే వివాహాలకు అడ్డుకట్టపడిందన్నారు. వధువు వయస్సు కనీసం 18 సంవత్సరాలు, వరుని వయసు 21 సంవత్సరాలు ఉండాలనే నిబంధన కారణంగా నిర్ణీత వయసు వచ్చాకే పెళ్లిళ్లు జరిగే పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం లబ్ధిదారుల మెగా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ అవనాపు భావన, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి, డీఎస్ డబ్ల్యూఓ రామానందం, మైనారిటీ సంక్షేమ అధికారి రుద్రపాటి శామ్యూల్ జాన్, లబ్ధిదారులు పాల్గొన్నారు

ఐదు విడతల్లో వైఎస్సార్ కళ్యాణమస్తు, షాదీతోఫా లబ్ధి ఇలా..

విడత	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
మొదటి విడత (ఫిబ్రవరి-23)	145	0.98
రెండు (మే-23)	764	4.36
మూడు (ఆగస్టు-23)	1,407	8.32
నాలుగు (నవంబర్-23)	478	2.80
బై యాన్యువల్ (జనవరి-24)	75	0.04
ఐదోవిడత (ఫిబ్రరి-24)	370	2.35
మొత్తం	3,239	18.85

కల్యాణ వైభోగమే



మాంగళ్యధారణ చేస్తున్న అర్చకులు



సీతమ్మతల్లికి సారెను తెస్తున్న భక్తులు

- రామతీర్థంలో వైభవంగా సీతారాముల తిరుక్కల్యాణం
- తిలకించిన భక్తజనం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవం మంగళవారం రాత్రి కనుల పండువగా జరిగింది. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారి తిరుక్కల్యాణాన్ని అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. వేకువజామునుంచే ఆలయంలో కల్యాణ మహోత్సవ సందడి ప్రారంభమైంది. ముందుగా రామకోనేరు పవిత్ర జలంతో ఆలయాన్ని శుద్ధిచేశారు. అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, పవన్ కుమార్, వరప్రసాద్ తదితరులు స్వామివారికి ప్రాతఃకాల అర్చన చేసి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉదయం 8గంటలకు శ్రీమద్రామాయణపారాయణం, వేద పఠనం నిర్వహించారు. అనంతరం యాగశాలలో విశేష హోమాలను జరిపించారు. సాయంత్రం 5 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్టాపన, బలి హరణం నిర్వహించారు. ధ్వజారోహణం చేపట్టి సమస్త దేవతామూర్తులను స్వామివారి కల్యాణానికి ఆహ్వానించారు.

వైభవంగా వాహన సేవ..

సీతారామస్వామివారిని వివిధ రకాల స్వర్ణాభరణాలు, పట్టువస్త్రాలతో అర్చకులు అలంకరించారు. రాత్రి 7 గంటలకు హంస, అశ్వ, గరుడ వాహనాలపై ఉత్సవ విగ్రహాలను రామతీర్థం పుర వీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి మూడు వాహనాల సేవను జరిపించారు. తిరువీధిలో సీతమ్మ, శ్రీరాముడి వాహనాలు ఎదురుపడినపుడు ఇరువురి గుణగణాలను, తిరుక్కల్యాణ విశిష్టతను వేదపండితులు వివరించిన ఘట్టం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి తీసుకువచ్చి స్వామివారి వివాహమహోత్సవాన్ని ప్రారంభించారు. ఆచారంగా కుమిలి గ్రామానికి చెందిన ఏకుల కుటుంబీకులు తెచ్చిన పట్టువస్త్రాలను స్వామివారికి సమర్పించారు.

మాంగళ్యధారణ..

సరిగ్గా రాత్రి 9.30 గంటలకు ముహూర్తం ప్రకారం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సీతమ్మవారి శిరస్సుపై జీలకర్ర బెల్లం పెట్టించి సీతారాముల తిరుక్కళ్యాణాన్ని వైభవోపేతంగా అర్చకులు జరిపించారు. అనంతరం తలంబ్రాల కార్యక్రమాన్ని కొనసాగించారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రామ క్షేత్రమంతా భక్త పారవశ్యంతో పులకించిపోయింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ రామగణేష్ తమ సిబ్బందితో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన ఈఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఆలయ ప్రాంగణంలో కోలాట ప్రదర్శన

క్లుప్తంగా

ప్రథమ స్థానంలో నెల్లిమర్ల కబడ్డీ జట్టు



ప్రథమస్థానం సాధించిన నెల్లిమర్ల కబడ్డీ జట్టు

నెల్లిమర్ల: అనకాపల్లి జిల్లా నాగులపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి మహిళల కబడ్డీ పోటీల్లో నెల్లిమర్ల జట్టు ప్రథమస్థానం సాధించింది. ఈ సందర్భంగా విజేతలకు రూ.40వేలు నగదు బహుమతి అందజేశారు. జట్టు కెప్టెన్‌గా తాడ్డి లావణ్య వ్యవహరించారు. నెల్లిమర్ల జట్టు గతంలో అనేకసార్లు ఉత్తరాంధ్ర, రాష్ట్రస్థాయిల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు జట్టు శిక్షకుడు, సీకేఎం జూనియర్ కళాశాల రిటైర్డ్ పీడీ బొమ్మన రామారావు తెలిపారు. ఈ సందర్భంగా జట్టును నెల్లిమర్ల కబడ్డీ సంఘం అధ్యక్షుడు బి. సూర్యనారాయణ, నగర పంచాయతీ పెద్దలు అభినందించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో పల్లవి ప్రతిభ



వెండి పతకం సాధించిన శనపతి పల్లవి

నెలిమర్ల రూరల్: ఈ నెల 19 నుంచి అరుణాచల్ ప్రదేశ్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్–2023 పోటీల్లో మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన వెయిట్ లిఫ్టర్ శనపతి పల్లవి ప్రతిభ కనబరిచింది. ఆంధ్రా యూనివర్సిటీ తరపున 64 కేజీల విభాగంలో మంగళవారం పోటీల్లో పాల్గొన్న పల్లవి స్నాచ్ 80 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్ 95 కిలోలు..మొత్తంగా 175 కిలోల బరువును ఎత్తి వెండి పతకం దక్కించుకుంది. ప్రతిభ కనబరిచిన వెయిట్ లిఫ్టర్ పల్లవికి జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సెంచూరియన్‌ను సందర్శించిన గిరిజన వర్సిటీ వీసీ



జైరో ప్లేన్ తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న గిరిజన వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ యూనివర్సిటీని గిరిజన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీవీ కట్టమణి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీలో అమలు చేస్తున్న కోర్సులు, నైపుణ్య విద్య గురించి సెంచూరియన్ వీసీ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రయోగశాలలు, పేపర్ లెస్ పరీక్షల విధానం, జైరో ప్లేన్ తయారీ, బ్యాటరీ ఆటోల తయారీ యూనిట్, తదితరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యను బోధించడానికి వీలుగా అన్ని పరికరాలు ఉన్నాయని ప్రశంసించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య



లక్ష్మి మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జరజాపుపేట గ్రామంలో ఓ వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఎస్సై రామగణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జరజాపుపేటలోని ఎస్సీ కాలనీకి చెందిన కింతాడ లక్ష్మి(38) భర్తతో తగాదాల నేపథ్యంలో మనస్తాపానికి గురై సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మృతదేహానికి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తిచేసి మంగళవారం బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామగణేష్ తెలిపారు.

గడ్డి వాములు దగ్ధం

గజపతినగరం: గజపతినగరం గ్రామ సచివాలయం-2 పరిధిలో ఉన్న దావాల పేట గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో రూ.50వేల విలువైన గడ్డి వాములు మంగళవారం దగ్ధమయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు కాల్చిన బీడీ అటు పారివేయడంతో గ్రామానికి చెందిన కొలుసు అప్పారావు,కొలుసు బంగారమ్మ, బి.రమణమ్మలకు చెందిన గడ్డి వాములు కాలిపోవడంతో నష్టం జరిగింది. సమాచారం మేరకు విజయనగరం అగ్నిమాపక కేంద్రం నుంచి సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹143	₹256	₹ 266

ఆరోగ్యశ్రీతో..
వినికిడి సమస్యకు విముక్తి

- చెవిటి, మూగతో బాధపడుతున్న బాలుడికి శస్త్ర చికిత్స
- మరో ఆరునెలల్లో మాట్లాడే అవకాశం





ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్న నిఖిల్ (ఇన్‌సెట్లో) ఆపరేషన్ ద్వారా మిషన్లు అమర్చిన చెవి ఎగువభాగం

రాజాం: చెవుడు, మూగ సమస్యతో బాధ పడుతున్న ఓ చిన్నారిని సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఆదుకుని కొత్త బంగారు లోకాన్ని పరిచయం చేస్తోంది. కొత్తగా ఈ పథకంలో చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంచడంతో చాలా మంది నిరుపేదలు లబ్ధిపొందుతున్నారు. అత్యవసర ప్రాణాపాయ సమయాల్లోనే కాకుండా తమకు పుట్టిన చిన్నారులకు వచ్చే దీర్ఘకాలిక వ్యాధులను సైతం నయం చేయించుకోగలుగుతున్నారు. ఈ పథకం ద్వారా చాలా మంది చిన్నారులు కొత్త ప్రపంచాన్ని చూస్తున్నారు. ఈ కోవలోకే వస్తాడు రేగిడి మండలం అంబఖండి గ్రామానికి చెందిన పుర్లి రాజ్యలక్ష్మి, ఏసుబాబుల కుమారుడు మూడున్నరేళ్ల నిఖిల్. పుట్టుకతోనే చెవుడు, మూగ సమస్యతో నిఖిల్ బాధపడుతున్న విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు తమ చిన్నారిని ఏడాది క్రితం రాజాంలోని వీర్ స్పీచ్ అండ్ హియరింగ్ క్లినిక్‌కు తీసుకొచ్చారు. అక్కడి వైద్యుడు డాక్టర్ కర్నాయిన శ్రీనివాస్ నాయుడు అప్పటి ఆరోగ్యశ్రీ నిబంధనల ప్రకారం ఒక చెవికి ఆపరేషన్ నిమిత్తం ఆరోగ్యశ్రీకి దరఖాస్తు చేయించారు.

ప్రస్తుతం రెండు చెవులకు..

ఒక చెవికి ఆపరేషన్ నిమిత్తం చిన్నారికి ప్రాథమిక చికిత్స ప్రారంభించి సిద్ధం చేశారు. అంతలోనే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ఆపరేషన్ వ్యయం పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో చిన్నారి రెండో చెవికి కూడా ఆపరేషన్ మంజూరైంది. దీంతో రెండు చెవులకు కాక్లియర్ ఎంప్లాంట్ ఆపరేషన్‌ను వైద్యులు చేసి మెషీన్లను అమర్చారు. ఈ రెండు ఆపరేషన్లకు రూ.18 లక్షలు వరకూ వ్యయాన్ని ప్రభుత్వమే భరించింది. రైతువారీ కుటుంబానికి చెందిన రాజ్యలక్ష్మి, ఏసుబాబులు ప్రభుత్వం తమ కుమారుడికి వినికిడి, మాట వచ్చేందుకు ఖర్చుచేసిన మొత్తాన్ని చూసి ఆశ్చర్యపోతున్నారు. అరుదైన ఈ చికిత్స ద్వారా తమ కుమారుడు కొత్త ప్రపంచాన్ని తెలుసుకోబోతున్నాడని తెలిసి ఆనందం వ్యక్తంచేస్తున్నారు. ఇంతవరకూ తమకు ఒక్క పైసా కూడా ఖర్చుకాలేదని, ప్రభుత్వమే మొత్తం భరించిందని నిఖిల్ తల్లిదండ్రులు సాక్షికి తెలిపారు.

మరో ఆరునెలల్లో సంభాషణ



చిన్నారి నిఖిల్‌కు ఏడాది క్రితం చికిత్స ప్రారంభించాం. ఇటీవలే రెండు చెవులకు ఆపరేషన్ చేయడంతో పాటు మెషీన్లు ఏర్పాటుచేశాం. ఇవి జీవితాంతం పనిచేస్తాయి. మరో 21 రోజుల నుంచి నిఖిల్‌కు అందరి మాట వినపడుతుంది. ఆరు నెలల వ్యవధిలో మాటలు నేర్చుకుని సంభాషించగలడు. ఇది చాలా అరుదైన చికిత్స. 5 సంవత్సరాల్లోపు చిన్నారులకు ఈ ఆరోగ్యశ్రీ పథకం వర్తిస్తుంది. గతంలో ఈ పథకం ద్వారా ఒక చెవికి మాత్రమే ఆపరేషన్ నిమిత్తం అనుమతి ఉండేది. ఇప్పుడు రెండు చెవులకు ఆపరేషన్ నిమిత్తం ప్రభుత్వం నిధులు ఇస్తోంది. రాజాం నియోజకవర్గ పరిధిలో ఇటీవల ఈ ఆపరేషన్ నిమిత్తం 22 మంది వరకూ చిన్నారులు అర్హత సాధించారు. వారందరికీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొత్త ప్రపంచాన్ని ఇస్తున్నారు.

కర్నాయిన శ్రీనివాస్ నాయుడు,
ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ థెరపీ వీర్ స్పీచ్ అండ్ హియరింగ్ ఆస్పత్రి, రాజాం.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



గ్రామ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

భోగాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు భోగాపురం మండలంలోని రావివలస గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రూ.21.40 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రం, రూ.17.50 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ సెంటర్ భవనాలను సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి ఆధ్వర్యంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటీర్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి పేదల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందజేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ అధినేత అధికారం అడ్డుపెట్టుకుని విచ్చలవిడి దోపిడీలు చేశారని ఆరోపించారు. ముఖ్యమంత్రి జగన్ సచివాలయ వ్యవస్థ, పేదలకు మెరుగైన వైద్యం అందించడం కోసం ఆరోగ్య ఉప కేంద్రాలు, రైతుల అభ్యున్నతి కోసం ఆర్బీకేల వ్యవస్థను ఏర్పాటు చేసి వ్యవసాయాన్ని పండగ చేశారని చెప్పారు. అన్ని రంగాల్లో ఆంధ్రప్రదేశ్ నంబర్ వన్ స్థానంలో ఉందని స్పష్టం చేశారు. అన్నివర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న గొప్ప నాయకుడు సీఎం జగన్ అని, ఆయనకు మనమంతా అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, పడాల భానుప్రకాశ్, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, ఉప్పాడ విజయ్‌భాస్కర్‌రెడ్డి, నడుపూరి సత్యనారాయణనాయుడు, పంచాయతీరాజ్ డీఈ బంగారునాయుడు, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, ఎంపీడీఓ చంద్రకళ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: పోక్సో కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలుశిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి మంగళవారం తీర్పు వెల్లడించినట్లు దిశ మహిళా పోలీసుస్టేషన్ సీఐ బి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం పట్టణంలోని బొండెలగూడెం గెడ్డవీధికి చెందిన లారీ క్లీనర్‌గా పనిచేస్తున్న చందక శ్రీనివాసరావు 2021 జూలై 28న ఒక బాలిక కుళాయి వద్ద నీరు పట్టుకుంటుండగా అసభ్యకరంగా ప్రవర్తించినట్లు దిశ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేయగా, అప్పటి మహిళా ఎస్సై కేటీఆర్ లక్ష్మి కేసు నమోదుచేసి దర్యాప్తు చేసి, నిందితుడ్ని అరెస్టు చేసి, న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు. సకాలంలో సాక్షులు, ఆధారాలను ప్రవేశపెట్టడంతో నిందితుడిపై నేరారోపణలు రుజువు కాగా స్పెషల్ జడ్జి ఫర్ పోక్సో కోర్టు పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాపూరి శంకరరావు వాదనలు వినిపించగా, హెచ్‌సీ బి.దివ్యజ్యోతి, సీఎంఎస్ హెచ్‌సీ రామకృష్ణ సహాయ, సహకారాలను అందించారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం

- చాదర్ సమర్పించిన దర్బార్ షరీఫ్ ఖలీల్‌బాబు
- వేలాది మంది భక్తులకు అన్నసమారాధన



భక్తులకు అన్నసమారాధన చేస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: హజరత్ ఖాదర్‌వలీబాబా ఉరుసు మహోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు బాబాను దర్శించి తరించారు. తొలిరోజు పవిత్రఖురాన్ షరీఫ్ పఠనంతో ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం చీమలపాడు సూఫీ పీఠాధిపతి మొహమ్మద్ ఖ్వాజా మోహియుద్దీన్ షా తాజ్ ఖాదరి, విజయనగరం దర్గా, దర్బార్ షరీఫ్ ముతవల్లి డాక్టర్ మొహమ్మద్ ఖలీలుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ నేతృత్వంలో అశేష భక్తులతో కలిసి ఫకీర్ మేళా, డప్పు వాయిద్యాలతో బాబా దర్గాకు ఊరేగింపుగా వెళ్లి బాబాది వ్యసమాధికి సుగంధ పరిమళ ద్రవ్యాలను, పూలు, గజమాలలతో చాదర్ సమర్పించారు. అనంతరం సూఫీ పీఠాధిపతి సజ్జాద నషీన్ మొహమ్మద్ ఖాజా మోహియుద్దీన్ షా ఖాదరి భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ఉరుసులో ప్రధానఘట్టం బుధవారం జరుగుతుందని చెప్పారు. బాబా జీవించి ఉన్న కాలంలో చిత్రీకరించిన ఆయన చిత్రపటాన్ని చాదర్, పూలు, సుగంధ ద్రవ్యాలతో ఒక ప్రత్యేక వాహనంపై ఉంచి నషాన్, చాదర్, సందర్ షరీఫ్‌లతో, ఫకీర్ మేళా ఖవ్వాలీలతో దర్బార్ షరీఫ్ నుంచి నగర వీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. మూడురోజుల పాటు ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు లంగర్ ఖానాలో భారీ ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. 172: బాబాకు చాదర్ సమర్పిస్తున్న దర్బార్ నిర్వాహకుడు డాక్టర్ ఖలీల్‌బాబు

పుష్పాలంకరణలో పైడితల్లి



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పోర్ట్ ట్రస్ట్ కార్యదర్శి మంజుభార్గవి, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కలవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం భక్తులకు పుష్పాలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ కార్య నిర్వహణాధికారి డీవీవీ.భాస్కర రావు ఆధ్వర్యంలో మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో కొలువైన అమ్మవారికి వేకువజామునుంచి ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ నేతృత్వంలో పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ సిరిమానుపూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా నిత్య పూజాదికాలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో వేదపండితులు శాస్త్రోక్తంగా అమ్మవారికి చండీయాగం నిర్వహించారు. విశాఖ పోర్ట్ ట్రస్ట్ కార్యదర్శి మంజుభార్గవి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించి, తరించారు.

డయల్ యువర్ డీపీటీఓకు స్పందన

- డీపీటీఓ టీవీఎస్ సుధాకర్



జిల్లా ప్రజారవాణా అధికారి టీవీఎస్ సుధాకర్

పార్వతీపురంటౌన్: డయల్ యువర్ డీపీటీఓ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని పార్వతీపురం మన్యం జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన స్థానిక తన కార్యాలయంలో డయల్ యువర్ డీపీటీఓ టెలిస్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలో గల ఆర్టీసీ సమస్యలను తెలుసుకునేందుకు ప్రతినెల క్రమం తప్పకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

వచ్చిన వినతులు

కవిటిభద్ర గ్రామానికి స్కూల్ పిల్లలకు బస్సు వేయాలి. పార్వతీపురం కూనేరుకు ఉదయం 8గంటలకు బస్సు వేయాలి. అడ్డాపుశీల గ్రామం వద్ద అన్ని పాసింజర్ సర్వీసులు హాల్ట్ ఉండాలి. మక్కువ నుంచి విశాఖపట్నానికి బస్సు సర్వీసు కావాలి. పార్వతీపురం వెలగవలస గ్రామానికి బస్సు సర్వీసు, దివ్యాంగులతో ఉండే వారికి ఎస్కార్ట్ బస్‌పాసులు ఏర్పాటు చేయాలి. సాలూరు నుంచి సింహాచలం బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలి. పాలకొండ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడుపుతున్నాడని ఫిర్యాదు వచ్చినట్లు డీపీటీఓ సుధాకర్ తెలిపారు. సాధ్యమైనంత వరకు ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు.

కోడి పందాలాడుతున్న ముగ్గురి అరెస్టు

బొండపల్లి: మండలంలోని జె.గుమడాం గ్రామం శివారులో మంగళవారం సాయంత్రం కోడి పందాలు ఆడుతుండగా ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కోడి పందాలు ఆడుతున్న సమాచారం మేరకు పోలీసులు అక్కడి వెళ్లి దాడి చేసి ముగ్గురు వ్యక్తులతో పాటు, ఏడు కోడి పుంజులు, రూ.11,350 రుపాయలు నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈమేరకు కేసు నమోదు చేశామని ఎస్సై లక్ష్మణ రావు చెప్పారు.

శతశాతం పారిశుద్ధ్యం మెరుగ్గా ఉండాలి

- డీపీఓ శ్రీధర్‌రాజా



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న డీపీఓ శ్రీధర్‌రాజా

చీపురుపల్లి: మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్యం శతశాతం మెరుగ్గా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రాజా చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాల మేరకు చీపురుపల్లి మేజర్ పంచాయతీలో జి.అగ్రహారం, రెడ్డిపేట, వంగపల్లిపేట, కొత్తగవిడివీధి, కొత్తకుమ్మరికాలనీ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేజర్ పంచాయతీలోని 20 వార్డుల్లో పారిశుద్ధ్య పనులు పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆదేశాల మేరకు చీపురుపల్లి మేజర్ పంచాయతీలో ఫిబ్రవరి 11 నుంచి 22 వరకు పారిశుద్ధ్య నిర్వహణ పనుల కోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే మేజర్ పంచాయతీలో ఉన్న పారిశుద్ధ్య కార్మికులతో పాటు ప్రత్యేక డ్రైవ్ కోసం అదనంగా మరికొంత మంది సేవకులను తీసుకుని, యంత్రాలు ఏర్పాటు చేసి పారిశుద్ధ్య నిర్వహణ చేపడుతున్నట్లు చెప్పారు. మరో రెండు రోజుల్లో మేజర్ పంచాయతీలో పూర్తి స్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పూర్తవుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ అన్నపూర్ణదేవి, మేజర్ పంచాయతీ అధికారి ఝాన్సీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ రాము తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో తిరుగుబాటు

- కార్యకర్తకు విలువ లేని పార్టీ
- జనసేనకు జిల్లా నాయకత్వం ఉందా?
- మండిపడ్డ పార్టీ నెల్లిమర్ల మండల అధ్యక్షుడు



పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న నెల్లిమర్ల మండల అధ్యక్షుడు అచ్చం నాయుడు

నెల్లిమర్ల రూరల్: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ తీరుపై విజయనగరం జిల్లాకు చెందిన ఆ పార్టీ నాయకులు తిరుగుబావుటా ఎగురవేశారు. గజపతినగరంలో ఇటీవల జరిగిన జనసేన పార్టీ ఆత్మీయ సమావేశంలో ఆ పార్టీ నేత జిల్లా నేతలు గురాన అయ్యలు, మాజీ ఎమ్మెల్యే పడాల అరుణ ఎదుట ఆ పార్టీ నెల్లిమర్ల మండల అధ్యక్షుడు పతివాడ అచ్చంనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన అధ్యక్షుడు పవన్ వ్యవహార శైలిపై సదరు నాయకుడు ప్రత్యక్ష విమర్శలు గుప్పించారు.. పార్టీ పెట్టిన నాటి నుంచి ఎంతో మంది కార్యకర్తలు చేతి చమురు వదిలించుకుంటే..కనీసం చేతికి జెండా కూడా ఇవ్వలేదని, ఎందుకు ఈ పార్టీ అంటూ ప్రశ్నించారు. ఏ ఒక్క కార్యకర్తకు పార్టీ నుంచి కనీస సహకారం లేదని చాలా బాధగా ఉందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో జనసేన పార్టీ తరపున పోటీ చేసి పారిపోయారని, అలాంటి వారికి ఇప్పుడు పదవులు ఇస్తారా? పవన్‌కల్యాణ్‌కు అసలు బుర్ర ఉందా? ఏం చేస్తున్నాడంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పంచాయతీ ఎన్నికలు జరిగినప్పుడు గ్రామాల్లో పోటీ చేయండని మొత్తుకున్నా ఎవరూ నిలబడలేదని, ఆ సమయంలో ఒక్కరైనా సపోర్ట్ చేశారా? జిల్లాలో పార్టీకి నాయకత్వం లేదు. ఎందుకు మనకు ఇలాంటి నాయకులంటూ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో జనసేన పార్టీకి గౌరవం ఉండేదని, ప్రస్తుతం పార్టీ పూర్తిగా బలహీన పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీతో పొత్తులో భాగంగా జిల్లాలో ఒకటి, రెండు సీట్లు జనసేనకు ఇవ్వడమేంటి? వాళ్లిచ్చిన ఒకటి రెండు సీట్లు మనం తీసుకోవడం ఏమిటి? కనీసం నాలుగైదు సీట్లు తీసుకునే దమ్ము మనకి ఉందంటూ ఫైర్ అయ్యారు. టీడీపీ వాడు మనకి వ్వడం ఏమిటి? సమానంగా పోటీ చేస్తాం. పవన్ సీఎం అభ్యర్థి అంటూ ప్రజల్లో చెప్పాల్సిన నాయకులు ఏం చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. జనసేన జిల్లా నాయకుల ముందు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తినప్పటికీ అందరూ చప్పట్లు కొట్టి అభినందించడం కొస మెరుపు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విజయనగరం క్రైమ్: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో బాలాజీ లాడ్జి ఎదురుగా రోడ్డు మీద గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు వన్‌టౌన్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయసు కలిగి ఉన్న గుర్తు తెలియిన వ్యక్తి గురించి విచారణ చేయగా ఎటువంటి వివరాలూ తెలియరాలేదన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, కుటుంబసభ్యులు, బంధువులు ఎవరైనా ఉంటే వన్‌టౌన్ పోలీసులను సంప్రదించాలని సీఐ బి.వెంకటరావు కోరారు.

ఎడ్ల బండిని లారీ ఢీ కొని ఎద్దు మృతి



లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన ఎద్దు

కొమరాడ: నాగావళి నది నుంచి ఇసుక తీసుకొచ్చేందుకు వెళ్తున్న ఎడ్ల బండిని కొమరాడ మండలం విక్రంపురం సమీపంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంతో ఎద్దు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం కృష్ణపల్లి గ్రామానికి చెందిన నాగిరెడ్డి సింహాచలం మంగళవారం ఉదయం ఎడ్ల బండిని తోలుకు వెళ్తుండగా అదే సమయంలో రాయగడ వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందగా ఎడ్లబండిని తోలుతున్న సింహాచలానికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై నీలకంఠం తెలిపారు.

148 మద్యం సీసాల పట్టివేత



మద్యంసీసాలు పట్టుకున్న ఎస్ఈబీ ఇంటెలిజెన్స్ వింగ్

విజయనగరం క్రైమ్: గంట్యాడ మండలంలోని పెదవేమలి గ్రామ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 148 మద్యం సీసాలను ఎస్ఈబీ ఇంటెలిజెన్స్ వింగ్ సీఐ విజయకుమార్, హెచ్‌సీ బాషా, కానిస్టేబుల్స్ రవి, సత్యనారాయణలు పట్టుకున్నారు. అనంతరం మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వాటిని తరలిస్తున్న నిందితుడు గేదెల సన్యాసినాయుడిని అదుపులోకి తీసుకుని ఎస్ఈబీ స్టేషన్‌లో అప్పడించారు.

పాలకొండలో 12 మద్యం బాటిల్స్..

పాలకొండ రూరల్: మండలంలోని బడ్డుమాసింగి గ్రామానికి చెందిన బుగత మణికంఠ 12 మద్యం బాటిల్స్‌ను అక్రమంగా తరలిస్తూ పాలకొండ ప్రధాన మార్కెట్‌లో ఎస్సై ఎస్.ప్రశాంత్ కుమార్‌కు మంగళవారం పట్టుబడ్డాడు. మద్యం సీసాలను సీజ్ చేసి నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్టు

భోగాపురం: మండలంలోని తూడెం గ్రామంలో బెల్టు షాపు ద్వారా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ వనుము లక్ష్మిని ఎస్సై సూర్యకుమారి మంగళవారం అరెస్టు చేసి కేసు నమోదు చేశారని సీఐ రవికుమార్ తెలిపారు. పట్టుబడిన ఆమె దగ్గర 19 మద్యం సీసాలను ఎస్సై సూర్యకుమారి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.